# మిగులు స్థలాలను..మింగేస్తున్నారు..!

- నాలాల బఫర్‌జోన్‌లు అన్యాక్రాంతం..
- నకిలీ పేపర్లతో యథేచ్ఛగా నిర్మాణాలు..
- దళారులుగా మారిన స్థానిక పెద్దలు..
- పేదలకు అంటగడుతున్న వైనం..
- చోద్యం చూస్తున్న అధికారయంత్రాంగం



సుభాష్‌నగర్ డివిజన్, క్రిష్ణమూర్తినగర్ కాలనీలో నాలా బఫర్‌జోన్‌ను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం



జీడిమెట్ల డివిజన్, గణేశ్‌నగర్‌లో నాలా బఫర్ జోన్‌లో వెలిసిన అక్రమ నిర్మాణం

కుత్బుల్లాపూర్,డిసెంబర్ 5: కాలనీల్లోని నాలా బఫర్‌జోన్లు పూర్తిగా మాయమవుతున్నాయి. నాలాకు ఆనుకొని ఖాళీ స్థలం కన్పిస్తే చాలు అక్కడే వాలిపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మరికొన్ని ప్రాంతాల్లో సంక్షేమ సంఘాల పెద్దలు, అధికారపార్టీకి చెందిన నేతలు .. ఖాళీ స్థలాల్లో పాగా వేసి.. అమాయకులైన పేదలకు అంటగడుతున్నారు. ఖాళీ స్థలాలను ప్రజా అవసరాల కోసం, పార్కుల ఏర్పాటు కోసం వినియోగించాలి.. కానీ ఖాళీగా కనపడితేచాలు ఆక్రమించేస్తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి, సుభాష్‌నగర్ డివిజన్ జేకేనగర్ సమీపంలో క్రిష్ణమూర్తినగర్ ప్రాంతంలో నాలా బఫర్ జోన్‌కు ఆనుకొని కొంత ఖాళీ స్థలం మిగిలి ఉంది. దీంతో ఆ స్థలంలో విద్యుత్ విభాగం అధికారులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అయితే కొందరు ఆ స్థలంలో నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసివేయించి, ఖాళీ స్థలాన్ని అమాయకులకు అంటగట్టారు. దీంతో సదరు వ్యక్తి ప్రస్తుతం ఆ స్థలంలో నిర్మాణం చేపట్టడం ద్వారా స్థానికులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణకు గురైన నాలా బఫర్ స్థలానికి మరో చోట అనుమతులు తీసుకున్న ఇంటి నిర్మాణం పత్రాన్ని చూపించి నిర్మాణం చేపట్టడం గమనార్హం.

- జీడిమెట్ల డివిజన్ పరిధి, గణేశ్‌నగర్ కాలనీలో అధికార పార్టీకి చెందిన ఓ నేత దాదాపు నాలా బఫర్ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. గతంలో బీఆర్‌ఎస్ హయాంలో నాలాకు ఆనుకొని ఉన్న కొన్ని అక్రమ నిర్మాణాలపై అధికారయంత్రాంగానికి ఫిర్యాదులు వెళ్లడంతో నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకున్నారు. కానీ ప్రభుత్వం మారడంతో ఇప్పుడు నాలాల మిగులు స్థలాలకు పూర్తిగా రక్షణ లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు.
- నాలాల బఫర్‌జోన్లను పరరిక్షించాలని స్థానికులు సంబంధిత సర్కిల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో అప్పటి వరకు పనులు నిలిపివేశారే తప్పా శాశ్వత చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### చర్యలు తీసుకుంటాం..

ఆయా కాలనీల్లో నాలాల స్థలాల ఆక్రమణపై అధికారులు, సిబ్బందిని పంపించి శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే ఊరుకునే పరిస్థితి లేదు. స్థలాల అన్వేషణ అనంతరం సంబంధిత నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి, తక్షణమే కూల్చివేతలు చేపడుతాం. – సురేందర్‌రెడ్డి, ఏసీపీ కుత్బుల్లాపూర్ సర్కిల్

## రేపు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 5 : కూకట్‌పల్లి నియోజకవర్గం న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సంస్థ అధ్యక్షుడు వేల్పుగొండ వెంకటస్వామి కోరారు. శనివారం ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి రంగధాముని చెరువు గట్టుపై ప్రపంచ దివ్యాంగుల వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో పాటు దివ్యాంగుల జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ వేదికపై దివ్యాంగులకు వీల్‌చెర్స్, బ్యాటరీ సైకిళ్లు, చంక కర్రలతో పాటు 150 మందికి దుప్పట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం ..



దుండిగల్,డిసెంబర్ 5: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, మధురానగర్‌కాలనీలో నిర్మిస్తున్న అష్ట లక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మధురానగర్ కాలనీకి చెందిన రామస్వామి కుటుంబసభ్యులు గురువారం రూ.1లక్ష 1వేయి, నూటపదహార్లు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశా రు. రామస్వామి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ..ఆలయ నిర్మాణానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రావు, లింగయ్య, హేమంత్‌రావు, రామలక్ష్మారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : ఎమ్మెల్యే మాధవరం

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 5 : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు రూ. 9.79 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు గౌసుద్దీన్, నేతలు ఉన్నారు.

## సీపీఎం జిల్లా మహా సభలను విజయవంతం చేయాలి



సీపీఎం జిల్లా మహా సభల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కృష్ణనాయక్, పార్టీ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 5 : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సీపీఎం మహా సభలను విజయవంతం చేయాలని కూకట్‌పల్లి మండల పార్టీ నాయకుడు కృష్ణనాయక్ కోరారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో సీపీఎం జిల్లా మహా సభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిసెంబర్ 7,8 తేదీలలో నిజాంపేట మున్సిపాల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహా సభలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు, పేదలు, కార్మికులు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లా మహా సభలకు సీపీఎం నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు శివకుమార్, చిరంజీవి, గోపాల్, మంగ్యా కృష్ణ, బాలు, భాషా, గోబ్రియా, తదితర నాయకులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ, పోలీసులు, కార్పొరేటర్ నర్సింహయాదవ్

బాలానగర్, డిసెంబర్ 5 : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదప డుతాయని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని వెస్లీ టీచర్స్‌కాలనీలో స్వంత నిధులు కేటాయించి కాలనీవాసుల సంక్షేమం కోసం ఏర్పాటు చేయించిన 32 సీసీ కెమెరాలను నార్త్‌జోన్ డీసీపీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. నేరాల నియంత్రణ, నేరస్తుల తక్షణ గుర్తింపు కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలు కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా కాలనీవాసులకు, బస్తీ వాసులకు భరోసా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణరెడ్డి, డీఐ సుందర్ నాయక్, ఎస్సై శివకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు కర్రె జంగయ్య, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, సారేగూడెంలో కొత్తగూడెం శ్రీశైలంముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం అయ్యప్పస్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ , తదితరులు పాల్గొని పూజలు చేశారు. అలాగే.. 9వ వార్డు కౌన్సిలర్ బండారీ మహేందర్‌యాదవ్, రాము గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. – దుండిగల్, డిసెంబర్ 1

## ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బాలానగర్, డిసెంబర్ 5 : రామకృష్ణ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. గురువారం రామకృష్ణ స్కూల్‌లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కర్రె జంగయ్య, సయ్యద్ ఎజాజ్, ఇర్ఫాన్, హరినాథ్, మల్లేశ్ యాదవ్, బుర్రి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థి అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 5: ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మండల పరిధి భోగారం గ్రామానికి చెందిన దుర్గం ఐలయ్య కుమారుడు శివకిరణ్(16)ఘట్‌కేసర్ పట్టణంలోని శ్రీ చైత న్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సం వత్సరం చదువుతున్నాడు. ఈనెల 4న ఇంట్లో నుంచి కళాశాలకు వెళుతున్నట్లు చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు కళాశాల యజమాన్యానికి ఫోన్ చేయగా ఈ రోజు కళాశాలకు రాలేదని చెప్పారు. దీంతో పరిసర ప్రాంతాలతో పాటు బంధు, మిత్రుల వద్ద వెతికారు. ఎక్కడ ఆచూకీ లేకపోవటంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యా దు చేశారు..



## బాధితులకు ఎల్ ఓసీ పత్రాల అందజేత

కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన బాధితులకు ఎల్‌ఓసీ పత్రాలను గురువారం చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు అందించారు. గాజులరామారం డివిజన్, సుభాష్‌చంద్రబోస్‌నగర్‌కు చెందిన మహ్మద్ గౌసుద్దీన్‌కు రూ.లక్ష, చింతల్ భగత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన జి.అశోక్‌కు రూ.1.15లక్షలు మంజూరైన పత్రాలను అందించారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సకాలంలో స్పందించి వారికి మెరుగైన వైద్య ఖర్చుల కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, మక్సూద్ అలీ, మల్లేశ్, ఇర్ఫాన్, శౌకత్ అలీ, తదితరులు పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్, డిసెంబర్ 5

## ప్రభుత్వ భూముల్లో వెలసిన బేసిమెంట్ల తొలగింపు

### ‘నమస్తే తెలంగాణ’లో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు



బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్ సమీపంలోని ప్రభుత్వభూమిలో వెలసిన బేసిమెంట్లను తొలిగిస్తున్న మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది

దుండిగల్, డిసెంబర్ 5: బాచుపల్లి మండలం, రాజీవ్‌గాంధీనగర్ సమీపంలోని ప్రభుత్వభూముల్లో వెలసిన బేసిమెంట్లను గురువారం అధికారులు తొలగించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లి, రాజీవ్‌గాంధీనగర్‌ను ఆనుకుని ఉన్న ప్రభుత్వభూమిని ఓ ప్రజాప్రతినిధి గత కొంతకాలంగా తన అనుచరులతో కబ్జాలు చేయిస్తున్నాడు. కబ్జాలు చేసిన భూమిలో 60–80 గజాల చొప్పున ప్లాట్లుగా మలిచి, వాటిల్లో చిన్న,చిన బేసిమెంట్లను నిర్మించి రూ.8లక్షల నుండి 10లక్షల వరకు విక్రయిస్తున్నాడు. దీనిపై ఈ నెల 3న ‘కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి’పేరిట ‘నమస్తే తెలంగాణ’లో కథనం ప్రచురించడంతో స్పందించిన తాసీల్దార్ పూల్‌సింగ్ తన సిబ్బందితో కలిసి గురువారం బేసిమెంట్లను తొలగింప జేశారు.

## డిమాండ్ల సాధనకు ఆర్టీసీ ఉద్యోగులు చలో బస్ భవన్



బాలానగర్, డిసెంబర్ 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయినందున ఆర్టీసీ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం చలో బస్ భవన్ కార్యక్రమానికి బయలు దేరి వెళ్లారు. గురువారం టీజీఎస్ ఆర్టీసీ కూకట్‌పల్లి డిపో ఉద్యోగులు ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు బస్ భవన్‌కు వెళ్లారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు.

## జేఎన్‌టీయూహెచ్ వర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలి

### బొట్ల భిక్షపతి



కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 5 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీకి రెగ్యులర్ వైస్ చాన్సలర్‌ను నియమించాలని వర్సిటీ జేఏసీ చైర్మన్ బొట్ల భిక్షపతి కోరారు. వర్సిటీ కి విచ్చేయుచున్న ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క... వర్సిటీలోని సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. వర్సిటీలో రెగ్యులర్ వైస్ చాన్సలర్ లేకపోవడం వల్ల సమస్యలు పరిష్కారం కాకా... విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెగ్యులర్ వైస్ చాన్సలర్‌తో పాటు శాశ్వత ఉద్యోగాల నియామకాలను చేపట్టాలని కోరారు. విద్యార్థులకు చెందిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసేలా చూడాలని, వర్సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు, వర్సిటీ అనుబంధ కళాశాలలకు శాశ్వత భవనాలను నిర్మించేలా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు.

## చిన్నారులకు యూనిఫాంల పంపిణీ



బాలానగర్, డిసెంబర్ 5 : అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కొత్త యూనిఫాంలను బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అందజేశారు. గురువారం ఫిరోజ్‌గూడ, డీ సంజీవయ్యకాలనీ, కుమ్మరిబస్తీలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు కొత్త యూనిఫాంలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంలు అందజేయడం శుభదా యకం అన్నారు కార్యక్రమంలో మందడి సుధాకర్‌రెడ్డి, పంజా రాంచందర్ ముదిరాజ్, ఎడ్ల ప్రభాకర్, మల్లారెడ్డి, సభాపతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఆర్ శ్రీనివాస్ ముదిరాజ్, బాజని నాగేందర్ గౌడ్, ప్రేంకుమార్ పాల్గొన్నారు.

# పర్వత్‌నగర్‌లో కలుషిత జలాలు సరఫరా..


## నెలరోజులుగా మురుగునీరు వస్తున్నా పట్టించుకోని అధికారులు



పర్వత్‌నగర్‌లో సరఫరా అయిన కలుషిత నీరు


అల్లాపూర్, డిసెంబర్ 5: అల్లాపూర్ డివిజన్ పరిధి, పర్వత్‌నగర్‌లోని పలు వీధుల్లో కలుషిత జలాలు, అలాగే మరికొన్ని ప్రాంతాల్లో దుర్వాసనతో కూడిన నీళ్లు సరఫరా అవుతున్నాయి. గత నెల రోజులుగా కలుషితనీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాగలేక, వాడుకోలేక నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. తాగడానికి నీళ్లు కొనుక్కోవాల్సి వస్తోందని అన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎన్నో ఏండ్ల క్రితం వేసిన మంచినీటి పైపులైన్లు, డ్రైనేజీ పైపులైన్లు ఉండటంతో సమస్య తరచూ ఉత్పన్నమవుతున్నది. అప్పటి జనాభా అవసరాలకు తగ్గట్టుగా పైపులైన్లు వేయగా.. ఇప్పటి జనాభాకు సరిపోవడంలేదు. అయితే పైప్‌లైన్ల సామర్థ్యాన్ని పెంచాల్సి ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. డ్రైనేజీ సమస్య ఏర్పడినప్పుడు మాత్రం పైప్‌లైన్లను తాత్కాలికంగా శుభ్రం చేసి వెళ్లడం మినహా చర్యలు చేపట్టకపోడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. కాగా..కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ , మంచినీటి పైప్‌లైన్లు పక్కపక్కనే ఉండటం వల్ల పైపులైన్లు లీకేజీలతో మురుగునీరు మంచినీటి పైపులైన్లలో కలుస్తోంది. దీంతో కలుషిత జలాల సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ సమస్యను పలుమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని పర్వత్‌నగర్ వాసులు కోరుతున్నారు.

## కుంగిన బ్రిడ్జికి మరమ్మతులు చేయాలి



కుంగిపోయిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, డిసెంబర్ 5 : ఫతేనగర్ డివిజన్, నాగార్జుననగర్, అక్షయ్ ఎన్‌క్లేవ్‌కు అనుసంధానంగా ఉన్న బ్రిడ్జి కుంగి పోవడం విచారకరమని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆ బ్రిడ్జిని జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. గౌతంనగర్ ప్రజలు నిత్యం బాలానగర్ వెళ్లడానికి అనువుగా ఉన్న బ్రిడ్జి కుంగిపోయినందున తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కార్యచరణలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో భిక్షపతి, శశి, కన్నయ్య, సలావుద్దీన్, బస్వరాజ్, శేఖర్, సాయినాథ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబీహాబేగం

## సమస్యలు పరిష్కరించండి : కార్పొరేటర్

అల్లాపూర్, డిసెంబర్ 5: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై కార్పొరేటర్ సబీహాబేగం వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం శ్రీవివేకానందనగర్ వార్డు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో డివిజన్‌కు చెందిన ఆయా కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొని స్థానిక సమస్యలపై చర్చించారు. స్ట్రీట్ లైట్లు, కరెంటు స్తంభాలు, కేబుళ్ల మార్చిడి, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ మార్చిడి, చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు, సీసీరోడ్లు, లోప్రెజర్ కారణంగా తాగునీటి ఎద్దడి, తదితర సమస్యల పై సమావేశంలో చర్చించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ....సత్వరమే కాలనీల్లో స్ట్రీట్ లైట్లు, లోప్రెజర్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. బీఆర్‌ఎస్ మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్‌గౌసుద్దీన్, వీరారెడ్డి, జహెద్ షరీఫ్, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివ, మధుసూదనాచారి పాల్గొన్నారు.

## ప్రపంచ సవాలుగా వాతావరణ మార్పులు

### ఐఎఫ్‌సీ ఇండియా కంట్రీ హెడ్ వెండీ వెర్నర్




సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

కొండాపూర్, డిసెంబర్ 5: వాతావరణంలో నిత్యం వచ్చే మార్పులు ప్రపంచానికి పెను సవాలుగా మారాయని ఐఎస్‌పీ ఇండియా కంట్రీ హెడ్ వెండీ వెర్నర్ అన్నారు. మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ‘ సుస్థిర భవిష్యత్తు నెట్ జీరో డైలాగ్’ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఫిన్లాండ్ కాన్సుల్ జనరల్ ఎరిక్ ఆఫ్ హోల్‌స్ట్రామ్, సందీప్ కుమార్ సుల్తానియాలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వాతావరణంలో వస్తున్న మార్పులు మన జీవితాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. మన ఆర్థిక వ్యవస్థ, వ్యక్తిగత వ్యాపారాలు, సమాజం, మన గ్రహ భవిష్యత్తుకు ఎంతో కీలకమన్నారు. గతంలో స్థిరత్వం, లాభదాయకత పరస్పర విరుద్ధంగా భావించేవారన్నారు. వ్యాపారులు లాభాలపై మాత్రమే దృష్టి పెట్టేవారని, సామాజిక ప్రభావాన్ని పట్టించుకునే వారు కాదన్నారు. కానీ, ఈ రోజుల్లో ఈ రెండు లక్ష్యాలు కలిసి నడవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన

మియాపూర్ , డిసెంబర్ 5 : ప్రజా పాలన పేరు చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి అడుగడుగునా నిర్బంధాలతో రాక్షస పాలన చేస్తున్నారని వివేకానందనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ , బీఆర్‌ఎస్ నా యకులు మాధవరం రంగారావు అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకుంటుంటే తట్టుకోలేక అణిచివేతలకు పాల్పడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి కక్షపూరిత చర్యలను మానుకోవాలని రంగారావు హితవు పలికారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా నేతలతో కలిసి రంగారావు గురువారం ఆయన నివాసానికి వెళ్లగా పోలీసులు బీఆర్‌ఎస్ అధినేతలతో కలిసి రంగారావును అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ.. అభివృద్ధి , సంక్షేమం హామీల అమలును వదిలేసి కేవలం బీఆర్‌ఎస్ నేతలను అనగదొక్కడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని రంగారావు పేర్కొన్నారు.

## అక్రమ అరెస్టులను సహించేది లేదు

శామీర్‌పేట, డిసెంబర్ 5: మాజీ మంత్రి హరీశ్‌రావుపై కేసు నమోదు సరికాదని వెంటనే కేసును ఎత్తివేయాలని,అక్రమ అరెస్టులను సహించేది లేదని టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ డిమాండ్ చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడంపై గురువారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అరెస్ట్‌తో జాగృతి వ్యవస్థాపకురాలు కవిత, జాగృతి నేతలు పరామర్శించడానికి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు జాగృతి నేతలైన పెద్దపల్లి మాజీ ఎంపీపీ బండారు శ్రీనివాస్‌గౌడ్, సుచిత్‌రావు, హరీశ్‌గౌడ్, గంగినేని ఉపేందర్, దాడి నిర్మిళ్‌రెడ్డి, మున్నా, కనిమెళి మల్లేశ్, జాగృతి రాష్ట్ర కో కన్వీనర్ బొల్లంపల్లి సందీప్‌కుమార్, తోట హరీశ్‌రావు, రేఖ, తదితరులను అరెస్ట్ చేసి శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ స్టేషన్‌కు చేరుకుని అరెస్ట్ అయిన వారికి సాంఘీభావం తెలిపారు.